ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 09.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కృత్రిమ మేధ మానవ మేధస్సు, విచక్షణకు ప్రత్యామ్నాయం కాదని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు.

2. ఆంధ్రప్రదేశ్ తో నీటి వివాదం పరిష్కారానికి అన్ని పార్టీలు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు విజ్ఞప్తి చేశారు.

3. కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్శిటిల భూములను లాక్కుంటోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు.

4. రాష్ట్రంలో శీతల గాలులు వీస్తున్నాయని వచ్చే రెండు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదు కావచ్చని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది.

**జిష్ణు దేవ్ వర్మ**

బిట్స్ పిలానీకి చెందిన అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం, 'బిట్సా గ్లోబల్ మీట్' BGM26 ఆరో ఎడిషన్ ఈరోజు హైదరాబాద్ లోని బిట్స్ క్యాంపస్ లో ప్రారంభమైంది . తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... బిట్స్ పిలానీ కేవలం విద్యా ప్రతిభకు మాత్రమే పరిమితం కాదని తరతరాలుగా నూతన ఆవిష్కరణలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను

పెంపొందిస్తోందని అన్నారు. AI ఇక భవిష్యత్తు కల కాదని, ఇది ఇప్పటికే అన్ని రంగాలను ప్రభావితం చేస్తోందని, జీవితాంతం నేర్చుకునే దృక్పథాన్ని యువత అలవరచుకోవాలన్నారు. AI డేటాను విశ్లేషించగలదు, నిర్ణయాలు తీసుకోగలదు, కానీ మానవ విచక్షణ, నైతికత, సృజనాత్మకత, కరుణకు అది ప్రత్యామ్నాయం కాదని గవర్నర్ అన్నారు.

జీఎస్

**రేవంత్ రెడ్డి**

నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా ఈ సమస్య పరిష్కారం కోసం అన్ని పార్టీలు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా , రావిర్యాల ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ నీటి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదన్నారు . దీంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని, తాము వివాదం కోరుకోవడం లేదని, పరిష్కారం కోరుకుంటున్నామని చెప్పారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

జీఎస్

**ఆయుష్' ఆసుపత్రి**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన విజ్ఞప్తితో కరీంనగర్ లో 'ఆయుష్' ఆసుపత్రిని ఏర్పాటు చే సేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందియ దీనిలో భాగంగా 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుకు మొత్తం 15 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు.

అందులో ఏడున్నర కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 'ఆయుష్' ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. స్థల ఎంపిక ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుతో పాటు డాక్టర్లు, సిబ్బంది నియామక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. కేంద్రం ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆయుష్ అధికారులతో చర్చించారు.

**పిటిసి, కరీంనగర్**

**అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల జిల్లా, కొండగట్టులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులు మళ్లీ యథావిధిగా వ్యాపారం చేసుకునేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు . 31 బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 83 లక్షల రూపాయల చెక్కులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి మంత్రి పంపిణీ చేశారు.

పిటిసి, జగిత్యాల

**పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందులో 3 కోట్ల పైచిలుకు విలువైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పోరిక బలరాం నాయక్ , ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య , తదితురులు పాల్గొన్నారు.

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

**జూపల్లి కృష్ణారావు**

కొల్లాపూర్ మండలం సింగోటం శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక ఎక్సైజ్ శాఖ మంత్రి కృష్ణారావు ఆదేశించారు. ముందుగా మంత్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న అనంతరం మంత్రి బ్రహ్మోత్సవాల

నిర్వహణపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జాతరలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం వంటి ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. భక్తుల రవాణ కోసం ఆర్టీసి అధికారుల అవసరమైన బస్సు సర్వీసులు నడించాలని ఆదేశించారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**సీతక్క**

ఈనెల 18వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం సందర్శిస్తారని పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ములుగు జిల్లా మేడారంలో ఈరోజు సీతక్క మీడియాతో మాట్లాడుతూ... అభివృద్ధి పనులు ఆదివాసి సాంప్రదాయాల ప్రకారమే జరుగుతున్నాయని అన్నారు.

బైట్ ... సీతక్క

పిటిసి, ములుగు

**ఊరట**

రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు ఈరోజు కొట్టి వేసింది. డిజిపి నియామక ఉత్తర్వులను రద్దు చేసేందుకు ధర్మాసనం నిరాకరించింది. అయితే , పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియను 4 వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సమగ్ర నివేదికతో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

**పిటిసి, హైదరాబాద్**

**అశ్వినీ వైష్ణవ్**

సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈరోజు న్యూఢిల్లీలో 'క్రియేటర్స్ కార్నర్'ను ప్రారంభించారు. ప్రసార భారతి ప్రారంభించిన ఈ కార్యక్రమం, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో సృజనాత్మక కంటెంట్‌ను ప్రదర్శించడం, ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... ప్రభుత్వం కోటి మంది యువతను క్రియేటర్ల ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ సంవత్సరం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో కొత్త ఆపరేటింగ్ సిస్టమ్ అభివృద్ధి సహా పూర్తి పునర్నిర్మాణం జరుగుతుందని కూడా ఆయన ప్రకటించారు. ఈ వ్యవస్థ ద్వారా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ప్రసార భారతి దాని అనుబంధ సంస్థల దృక్పథం పరిశ్రమ, భాగస్వాములు, కొత్త తరం సృష్టికర్తలు, సాంకేతికత వైపు మారుతుందని ఆయన అన్నారు.

ఎన్ఎస్డీ

**నిర్మలా సీతారామన్**

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈనెల 10వ తేదీన ఢిల్లీలో అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సమావేశం జరగనుంది. రాష్ట్రాల అవసరాలు, అవి కోరుకుంటున్న కొత్త ప్రాజెక్టులు, విధానపర నిర్ణయాల్లో మార్పులు, కేంద్రం నుంచి నిధుల విడుదలకు వస్తున్న డిమాండ్లు, వీటన్నింటిపై ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో నిర్మలా సీతారామన్ చర్చించనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఆర్థిక శాఖ కు చెందిన అధికారులు కూడా ఢిల్లీ వెళ్తున్నారు.

డెస్క్

**మంచిర్యాల జిల్లా...**

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు అవసరమైన సదుపాయాలు పాఠశాలల్లో కల్పిస్తున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సీఎం కప్ రెండవ ఎడిషన్ లో భాగంగా ఈరోజు టార్చ్ జెండా ఊపి ప్రారంభించి న అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...

**సౌండ్ బైట్ ... కుమార్ దీపక్**

**పిటిసి, మంచిర్యాల**

**తారక రామారావు**

కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటిల భూములను లాక్కొంటూ భూ వ్యాపారం చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. ఉర్దూ విశ్వ విద్యాలయం భూములకు సంబంధించి ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన నేపధ్యంలో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం జైశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి 100 ఎకరాలు తీసుకుందని, హైదరాబాద్ సెంట్రల్ విశ్వ విద్యాలయం నుంచి 400 ఎకరాలు తీసుకునేందుకు ప్రయత్నించారని విమర్శించారు.

డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో తూర్పు, ఈశాన్య దిశల నుండి శీతల గాలులు వీస్తున్నాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. వచ్చే రెండు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల నుండి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ప్రెస్ నోట్

**బయో ఏషియా-2026**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక భూమిక పోషిస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు

అన్నారు.  ఆసియాలో అత్యంత ప్రతిష్టాత్మక లైఫ్ సైన్సెస్ , హెల్త్-టెక్ సదస్సుగా పేరుగాంచిన బయోఏషియా-2026 సదస్సు  అధికార  పోస్టర్ ను ఆయన నిన్న ఆవిష్కరించారు.  ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు బయోఏషియా-2026 సదస్సు   హైదరాబాద్‌లో  జరగనుంది.   బయో ఏషియా 2026తో టెక్ బయో విప్లవాన్ని ముందుకు నడిపిస్తూ ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రపంచ నిపుణులను హైదరాబాద్‌లో ఒకే వేదికపైకి తీసుకురావడం తమ లక్ష్యమని మంత్రి  చెప్పారు.

DESK

**రోడ్డు భద్రత:**

హైదరాబాద్ లో రోడ్డు ప్రమాదాల నివారణ కు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో   జరిగిన  సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ... రోడ్డు భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో కలసి పని చేసి , ప్రమాదాలను తగ్గించాలన్నారు. నగరంలో ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రాంతాలు , బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటిని సరిదిద్దాలని సూచించారు. ఇందుకోసం ఆధునిక బారికేడింగ్ , డివైడర్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు , కళాశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

**---MSL**

**ఈటెల రాజేందర్ - నిర్మల్**

నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ పాలకవర్గాలకు  అవసరమైన  నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని  మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈరోజు   నిర్మల్ జిల్లా,  భైంసా పట్టణంలో ఇటీవల ఎన్నికైన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగులకు , పారిశుద్ధ్య కార్మికులకు, రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు సరిగా వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. రాబోవు రోజులలో

తెలంగాణలో  బిజెపి పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పిటిసి, నిర్మల్

**రద్దీ - నల్లగొండ**

సంక్రాంతి పండుగ సెలవుల తో  హైద్రాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్ళే   వారితో  వాహనాల రద్దీ మొదలైంది. ప్రధానంగా  ఉమ్మడి నల్లగొండ ,  ఖమ్మం,  వరంగల్ జి ల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే వాహనాలన్నీ నల్లగొండ జిల్లా మీదుగానే వెళ్తుండటంతో జాతీయ రహదారులన్నీ రద్దీగా మారాయి.   దీంతో  కోదాడ మండలం కొమరబండ పై జంక్షన్ నుంచి రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రా స్ రో డ్ వరకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.     అయితే,  ఫ్లై  ఓవర్ పనులు జరు గుతున్న        కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో          వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పిటిసి, నల్గొండ